క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



షేక్ అహ్మద్ వలిబాబా కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి పరామర్శ

నిడదవోలు: కుటుంబ పెద్దలను కోల్పోయిన పట్టణంలోని రెండు కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పరామర్శించారు. మూడో వార్డుకు చెందిన షేక్ అహ్మద్ వలిబాబా ఇటీవల మరణించడంతో ఆయన కుమారుడు షేక్ జిలానీని పరామర్శించారు. అలాగే దారపురెడ్డి అన్నపూర్ణమ్మ మరణించడంతో ఆమె కుమారుడు ప్రతాప్‌ను శ్రీనివాస్‌నాయుడు పరామర్శించారు. రెండు కుటుంబాల వారికీ ఆయన ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కే చాన్‌బాషా, ఎండీ ఫయాజ్, తోలేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చన్నపాలెంలో పౌష్టికాహార మాసోత్సవాలు



అచ్చన్నపాలెంలో సీమంతాలు చేస్తున్న సీడీపీఓ పద్మావతి

నల్లజర్ల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ గోపాలపురం సీడీపీఓ పద్మావతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా మండలంలోని అచ్చన్నపాలెం 30వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద బుధవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ, తేలిక పాటి వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌వీ కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

నిడదవోలు: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించినట్టు ఆ పార్టీ నిడదవోలు నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 40 రోజుల పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. బీజేపీ విధానాలను ఏకీభవించే వారు సభ్యత్వాలను తీసుకోవాలని ఆయన కోరారు.

వీడని వర్షం.. తీరని కష్టం

- ముంపులో పంటలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పొంగి ప్రవహిస్తున్న చెరువులు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులుగా రోజూ ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. గత రెండు రోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లోని రహదారులు అధ్వానంగా మారాయి. గ్రావెల్ రోడ్లు బురదగా తయారవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పంట చేలు ముంపు నుంచి పూర్తిగా తేరుకోనేలేదు. ఇంతలోనే మళ్లీ బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు ఏర్పడుతున్నాయి. వాటి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సాగుపై ప్రకృతి పగ బట్టిందంటూ వాపోతున్నారు.

నిండుకుండల్లా సాగునీటి చెరువులు

వర్షాలకు మెట్ట ప్రాంతంలోని సాగు నీటి చెరువులు నిండుకుండల్లా మారాయి. పలు చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ, ఎర్ర కాలువలు గోపాలపురం నియోజకవర్గంలో పంటలను ముంచెత్తున్నాయి. దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో కొవ్వాడ కాలువ ముంపు ఎక్కువ. త్యాజంపూడిలో బర్లవాగు ఉధృతికి కురుకూరు, త్యాజంపూడి గ్రామాల్లోని సుమారు 400 ఎకరాల్లోని పంటలు ముంపునకు గురవుతున్నాయి. ఎర్ర కాలువ ఉధృతికి నల్లజర్ల మండలంలోని పలు గ్రామాల్లోని పంటలు దెబ్బతిని రైతులు విలవిలలాడుతున్నారు. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు ఎర్ర కాలువ, బర్లవాగు, తాడిపూడి ప్రధాన కాలువలకు పలుచోట్ల గండ్లు పడడంతో వేలాది ఎకరాల్లోని వరి చేలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకుండానే మళ్లీ తుపానులు రావడంతో కోలుకోలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలోని 30 వేల ఎకరాల్లో..

ముందుగా వేసిన వరి చేలు ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ దశలో చేలు దెబ్బతింటే దిగుబడి రాదని రైతులు అంటున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈ ఖరీఫ్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. త్యాజంపూడిలోని ఆవ చెరువు, యర్నగూడెంలోని గండి చెరువు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండి చెక్ డ్యామ్‌ల ద్వారా అవుట్ ఫ్లో అవుతున్నాయి. కొవ్వాడ, ఎర్ర కాలువ ప్రస్తుతానికి నిలకడగా ఉన్నాయని రైతులు తెలిపారు. జంగారెడ్డిగూడెం వద్ద గల కొంగువారిగూడెం జలాశయం గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేస్తే దిగువన ఉన్న పంటలను ఎర్ర కాలువ ముంచెత్తుతుంది. ఎగువన గల కొండ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు కొవ్వాడ కాలువ ద్వారా ప్రవహించి గోపాలపురం, దేవరపల్లి, కొవ్వూరు, చాగల్లు మండలాల్లోని పంటలను ముంచెత్తుతోంది.ఈ రెండు కాలువల్లోనూ బుధవారం సాధారణ స్థాయిలో నీరు ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు.

గండ్లు పూడ్చివేత..

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు దేవరపల్లి మండలం త్యాజంపూడి, కురుకూరు గ్రామాల పరిధిలో బర్ల వాగుకు ఐదు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. ఆ నీరు పంట పొలాలను ముంచెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇసుక బస్తాలతో గండ్లు పూడ్చే పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. ఇటీవల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మిక పర్యటన జరిపి గండ్లు పూడ్చివేత పనులను పరిశీలించారు. గండ్లు యుద్ధప్రాతిపదికన పూడ్చి ఒక్క ఎకరం కూడా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి గండ్లు పూడ్చి ముంపు సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు.



దేవరపల్లి మండలం కురుకూరు వద్ద బర్ల వాగుకు పడిన గండికి ఇసుక బస్తాలతో వేసిన అడ్డుకట్ట

దొండపూడి- సాగిపాడు మధ్య రాకపోకల బంద్



రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న కొవ్వాడ కాలువను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

గోపాలపురం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దాంతో మండలంలోని దొండపూడి- సాగిపాడు గ్రామాల మధ్య రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. కొవ్వాడ కాలువ పరిస్థితిని తెలుసుకునేందుకు కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం ఇక్కడకు వచ్చారు. పరిస్థితిని స్వయంగా పరిశీలించిన ఆయన ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేయాలంటూ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అలాగే కొవ్వాడ కాలువ ప్రవాహ ఉధృతికి మండలంలోని చిట్యాల, చెరుకుమిల్లి, వెంకటాయపాలెం గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లోని వరి పంట నీట మునిగిందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

వరద బాధితుల ఆకలి తీర్చేందుకు..



తాళ్లపూడి నుంచి ఆహారం పంపుతున్న కొవ్వూరు సబ్ కలెక్టర్, తాళ్లపూడి తహసీల్దార్



ఉండ్రాజవరంలో ఆహార ప్యాకెట్ల వాహనాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ప్రసాద్



నిడదవోలులో ఆహారం వ్యాన్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

- ఆహారం, తాగునీటి వాహనాలు విజయవాడకు..
- రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పలు మండలాల నుంచి తరలింపు

తాళ్లపూడి: జల విలయంలో చిక్కుకుని, ఆకలితో అలమటిస్తున్న విజయవాడ వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు ఆపన్నులు ముందుకొచ్చారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కొవ్వూరు డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి వాహనాలు బయలుదేరి వెళ్లాయి. తాళ్లపూడి తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో దాతల సాయంతో మండల రెవెన్యూ సిబ్బంది 2,500 ఆహారం ప్యాకెట్లు, తాగునీటి ప్యాకెట్లు సిద్ధం చేసి వ్యాన్‌లో విజయవాడ తరలించారు. భోజనం ప్యాకెట్ల తయారీకి ఠాగూర్ ఫ్యాక్టరీ రూ.40 వేలు, మండల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు రూ.10 వేలు, నామన పరమేశ్వరరావు రూ.10 వేలు, కొప్పాక కోటీన్స్ రూ.10 వేల ఆర్థిక సాయం చేసినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ భారతి తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: విజయవాడ వరద బాధితుల కోసం మండల రెవెన్యూ శాఖ తరపున బుధవారం 2,500 ఆహార పొట్లాలను ప్రత్యేక వ్యాన్‌లో పంపించినట్టు తహసీల్దార్ డి.అచ్యుత కుమారి తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కనకదుర్గ, పావని, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక తహసీల్దార్ పీఎన్‌డీ ఆధ్వర్యంలో మండలం నుంచి విజయవాడ వరద బాధితుల కోసం 2,500 బిర్యానీ పొట్లాలను, ఐదు వేల వాటర్ ప్యాకెట్లను వ్యాన్ ద్వారా విజయవాడకు తరలించారు. కార్యక్రమంలో మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

నిడదవోలు: వరద బాధితులకు నిడదవోలు మండలం రెవెన్యూ అధికారులు 2,500 ప్యాకెట్ల వెజ్ బిర్యానీని విజయవాడ పంపించారు. తహసీల్దార్ ఎం.నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో ఇద్దరు వీఆర్వోలు భోజన పొట్లాల వ్యానును విజయవాడ వరద బాధితుల వద్దకు తీసుకుని వెళ్లారు.

ఐదు వేల ప్యాకెట్లు

కొవ్వూరు: విజయవాడ వరద బాధితుల కోసం అవంతీ ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ ఐదు వేల భోజనం ప్యాకెట్లను బుధవారం ప్రత్యేక వాహనంలో పంపించారు. ఫ్లడ్ రిలీఫ్ ప్రాంతాలను పర్యవేక్షిస్తున్న అధికారులకు వీటిని అందజేయనున్నట్టు తెలిపారు.

చాగల్లు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద బాధితుల కోసం 2,500 ఆహార ప్యాకెట్లను తయారు చేయించి బుధవారం ఉదయం ప్రత్యేక వాహనంలో విజయవాడ పంపించామని తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



పోతవరం నుంచి విజయవాడకు తీసుకు వెళుతున్న ఆహారం ప్యాకెట్ల వ్యాన్

నల్లజర్ల: వరద బాధితులను ఆదుకునేందుకు పోతవరంలోని పద్మశాలి ఐక్యవేదిక ముందుకు వచ్చింది. సుమారు ఐదు వేల ఆహార పొట్లాలు, మరో ఐదు వేల వాటర్ ప్యాకెట్లతో మినీ వ్యానుపై ఆ సంఘస్తులు బుధవారం విజయవాడ బయలుదేరి వెళ్లారు. వాటిని తామే స్వయంగా బాధితులకు అందిస్తామని చెప్పారు.

పెన్షనర్ల సాయం

నల్లజర్ల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల నల్లజర్ల మండల శాఖ ఒక రోజు పెన్షన్‌ను విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్టు ఆ సంఘం అధ్యక్షులు ఐవీ సత్యం, కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే



సీహెచ్ నాగేంద్రరావు



డి.పద్మ సుజాత



పి.సుభాషిణి



మాణిక్యాంబ



శ్రీనివాసమూర్తి



ఆర్.పద్మశ్రీ

కొవ్వూరు: పట్టణానికి చెందిన ముగ్గురు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా గురువారం రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో నిర్వహించే వేడుకలో వారీ పురస్కారాలు స్వీకరించనున్నారు. ఏడేళ్లుగా నూరు శాతం ఫలితాలు సాధించినందుకు మండలంలోని ఐ.పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు టీచర్‌గా పనిచేస్తున్న పట్టణంలోని 23వ వార్డుకు చెందిన ముంజులూరి మాణిక్యాంబకు ఈ అవార్డు దక్కింది. అలాగే పట్టణంలోని సంస్కృతోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న గోవర్ధనం శ్రీనివాస మూర్తి కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. సైన్స్ ఉపాధ్యాయుడిగా పలు సైన్స్ ఫెయిర్స్ (విజ్ఞాన ప్రదర్శనల)కు ఆయన విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించారు. కొవ్వూరు ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.పద్మశ్రీకి కూడా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు దక్కింది.

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేట ఎంపీపీ-2 పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిచ్చెనకోళ్ల కృష్ణకుమారి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. విధి నిర్వహణలో నిబద్ధత, పాఠ్యాంశాల బోధనలో ప్రత్యేకత చాటుకున్న ఆమె ఈ అవార్డు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణకుమారిని ఎంఈఓలు కేవీ గణేష్, పి.గురుమూర్తి, పలువురు టీచర్లు బుధవారం అభినందించారు.

నల్లజర్ల: మండలం నుంచి నలుగురు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. వారిలో వల్లూరి సత్యనారాయణమూర్తి (స్కూల్ అసిస్టెంట్, సింగరాజుపాలెం హైస్కూలు), పెండ్యాల హేమంత్‌కుమార్ (మేథ్స్ స్కూల్ అసిస్టెంట్, అనంతపల్లి జెడ్పీ హైస్కూల్), తోట మరియదాసు(ప్రాథమిక పాఠశాల, కృష్ణాయిగూడెం), కామిశెట్టి వీర వెంకట్రావు(పీఈటీ, జెడ్పీ హైస్కూల్, పుల్లలపాడు) ఉన్నారన్నారు.

తాళ్లపూడి: మండలం నుంచి ముగ్గురు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగేంద్రరావు, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు డి.పద్మ సుజాత, వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పిసుభాషిణి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై న వారిలో ఉన్నారన్నారు.

రోడ్లపై నిలిచిపోయిన నీరు



బ్రాహ్మణగూడెం వద్ద రోడ్డుపై పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



తాళ్లపూడిలో సీసీ రోడ్డుపై నిలిచిపోయిన నీరు

తాళ్లపూడి: బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. మండలంలో 59.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల రోడ్లపైన, పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. రోడ్లనీ చిత్తడిగా మారాయి. అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. తాళ్లపూడి ఎస్సీ ఏరియాలోని సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. స్థానిక ఆర్‌బీకేకు వెళ్లే రోడ్డు బురదగా మారడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి వేగేశ్వరపురం హైస్కూల్ వద్ద, సమీపంలోని సీసీ రోడ్లపైనా నీరు నిలిచిపోయింది. నీటిని బయటకు తరలించేందుకు పంచాయతీ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. మండలంలో బుధవారం 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలకు నిడదవోలు- పంగిడి రహదారిపై గోతులు పడ్డాయి.ఆ గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. బ్రాహ్మణగూడెం, ఎస్. ముప్పవరం, ఊనగట్ల, చాగల్లు వద్ద రోడ్డు పూర్తిగా శిథిలమైంది. కనీసం గుంతలను పూడ్చకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఊనగట్ల - కుంకుడిమిల్లి రోడ్డు, దారవరం శివార్లలోనూ రోడ్డు బాగా దెబ్బతింది. రోడ్లు గోతులు పడినా ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

కుండపోతతో అన్నదాత దిగాలు



ఖండవల్లిలో నీట మునిగిన దొండ పందిరి

పెరవలి: అల్పపీడనం ప్రభావంతో బుధవారం తెల్లవారుజాము 3 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మండలంలో భారీ వర్షం కురిసింది. ఈ తొమ్మిది గంటల్లోనే జిల్లాలోనే అత్యధిక వర్షపాతం 10 సెంటీమీటర్లు నమోదైంది. ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిలో కుండపోతగా కురిసిన వర్షానికి పంట చేలు నీట మునిగాయి. రోడ్లు కాలువలను తలపించాయి. జన జీవనానికి అంతరాయం కలిగింది. పొలాల్లో మోకాలి లోతున నీరు నిలిచిపోయింది. అరటి, కంద, కూరగాయల పందిర్లి, కూరగాయల తోటలు, పూల తోటలు తలలు వంచాయి.

మళ్లీ గోదావరి పరవళ్లు



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి

కొవ్వూరు: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదిలో క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో వరద పరవళ్లు తొక్కుతోంది. స్నాన ఘట్టాల దిగువ మెట్లన్నీ వరద ముంచెత్తింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఉప నదుల నుంచి భారీగా వరద నీరొచ్చి చేరుతోంది. దీంతో దిగువన ధవళేశ్వరం ఆనకట్ట వద్ద బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు నీటి మట్టం 9.70 అడుగులుగా నమోదైంది. గురువారం వరద ఉధృతి మరింత పెరిగే అవకాశాలున్నాయని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకోసం డెల్టా కాలువలకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను బుధవారం తగ్గించారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు 1000 క్యూసెక్కులు వదులుతున్నారు. మధ్య డెల్టాకు 500 క్యూసెక్కులు విడుదల చేశారు.

రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు



కె.సావరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్

ఉండ్రాజవరం: మండలంలోని కె.సావరం, చిలకపాడు గ్రామాల్లో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. చిలకపాడులో డాక్టర్ ఇర్వాన్, కె.సావరంలో డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రతకు చిలకపాడులో పారిశుధ్య కార్మికులచే బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసు, కె.సుభాషిణి, కాపా నాగరాజు, సంధ్య, బ్యూలాజోయ్, మల్లేశ్వరి, బి.శ్రీనివాసు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు శాంతిరథం ఏర్పాటు

దేవరపల్లి: మండలంలోని మూడు గ్రామాల్లో బుధవారం నలుగురు మృతి చెందారు. కృష్ణంపాలెంలో పల్లంట్ల లింగమ్మ, చిన్నాయగూడెంలో వర్ణ కవి, కాకినాడ పంతులమ్మ, కురుకూరులో కలరగ కాశీవిశ్వనాథం అనారోగ్యంతో మృతి చెందారని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ తెలిపారు. భారీ వర్షం వల్ల ఆ గ్రామాల్లో దహన సంస్కారాలు సాధ్యపడలేదు. దీంతో మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా శాంతి రథం ఏర్పాటు చేసి పార్థివ దేహాలను కొవ్వూరు గోదావరి తీరాన గల కైలాస భూమికి తరలించినట్టు ఆయన తెలిపారు.

రజకులకు విశ్రాంతి భవనాలు నిర్మించాలి

నల్లజర్ల: రజకులకు విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య బుధవారం ఘంటావారిగూడెంలో నిర్వహించిన రజక సంఘ సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేసినట్టు ఆయన చెప్పారు. రజకుల సమస్యలు ఆమె దృష్టికి తీసుకు వచ్చినట్టు చెప్పారు. నూతన భవనాలు ఏర్పాటు చేయడంతో పాటు పాత భవనాలకు మరమ్మతులు చేపట్టాలని కోరామన్నారు. ప్రతి గ్రామంలోనూ మంచి నీటి చెరువు తప్పించి రజకుల వృత్తికి ఒక చెరువును కేటాయించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జువ్వలపాలెం సత్యనారాయణ, భీమవరపు మహంకాళి తదితరులు పాల్గొన్నారు.